క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కంభంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై నరసింహారావు

కంభం: పాత నేరస్తులు సమాజంలో సత్ప్రవర్తనతో నడుచుకోవాలని స్థానిక ఎస్సై బి.నరసింహారావు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం సాయంత్రం పట్టణంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పాత నేరస్తులపై ఎల్లప్పుడూ పోలీసు నిఘా ఉంటుందని, ఎవరైనా నేరాలకు పాల్పడినట్లు రుజువైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్రమశిక్షణతో నడుచుకుంటే భవిష్యత్‌లో రౌడీషీట్లు తొలగించే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

ఓటర్ల నుంచి 141 దరఖాస్తుల స్వీకరణ

కొమరోలు: మండలంలో ఓటు కార్డుల్లో చేర్పులు, మార్పులు, ఓటు నమోదుకు సంబంధించి 141 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌ఓలు రెండు రోజులపాటు ప్రత్యేక క్యాంపెయిన్‌లో పాల్గొనగా నూతన ఓటు నమోదుకు 68 దరఖాస్తులు, సరవణల కోసం 65, ఓట్ల తొలగింపుపై 18 దరఖాస్తులు వచ్చాయని వివరించారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం



సీజ్ చేసిన మద్యంతో ఎస్సై పి.కోటేశ్వరరావు

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఎస్సై పి.కోటేశ్వరరావు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 12 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వెల్లుపల్లెలో కొండచిలువ కలకలం



బంధించిన కొండచిలువతో అటవీశాఖ సిబ్బంది

గిద్దలూరు రూరల్: మండలంలోని వెల్లుపల్లె గ్రామ సచివాలయం సమీపంలో కొండచిలువ స్థానికులను భయభ్రాంతులకు గురిచేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారంతో అటవీశాఖ రెస్క్యూ బృందం అశోక్, ప్రసాద్, శివ, కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని కొండచిలువను బంధించారు. అలాగే నల్లగట్ల గ్రామంలో నాగుపామును చాకచక్యంగా బంధించారు. రెండింటినీ నల్లమల అటవీప్రాంతంలో వదిలేయనున్నట్లు సిబ్బంది తెలిపారు.

మినుముకు తెగులు.. రైతుకు దిగులు



మినుము పైరును ట్రాక్టర్‌తో దున్నేస్తున్న రైతు

- మినుము రైతులను నిండా ముంచిన పల్లాకు తెగులు
- కృష్ణా జిల్లా మినుము విత్తనాలు కొని సాగు చేసిన రైతులు
- కొనకనమిట్ల మండలంలో 300 ఎకరాల్లో పంట దున్నేస్తున్న వైనం
- పల్లాకు తెగులు సోకడంతో దిగుబడి రాదని పేర్కొంటున్న రైతులు
- ఒక్కో ఎకరాకు రూ.15 వేలకు పైగా నష్టం

కొనకనమిట్ల:

ప్రకృతి వైపరీత్యాలు వ్యవసాయదారులను అతలాకుతలం చేస్తున్నాయి. అతివృష్టి–అనావృష్టి కారణంగా పంటలు సక్రమంగా పండక రైతులకు కలిసి రావడం లేదు. గత నెలలో వారం రోజులకు పైగా విస్తారంగా కురిసిన భారీ వర్షాలకు మార్కాపురం నియోజకవర్గంలో 3 వేల హెక్టార్లకు పైగా విస్తీరణంలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. ఈ మేరకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. సరిగ్గా ఈ వర్షాలు కురవడానికి రెండు మూడు వారాల ముందు కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల రైతులు మినుము సాగు చేశారు. కృష్ణా జిల్లాలో బయట మార్కెట్‌లో మినుము విత్తనాలు కొనుగోలు చేసినట్లు రైతులు చెబుతున్నారు. మొదట్లో పైరు బాగానే ఉన్నప్పటికీ రోజులు గడిచే కొద్దీ పంట మొత్తానికి పల్లాకు తెగులు సోకి పాలిపోతోంది.

ఎకరాకు రూ.15 వేల నష్టం

పల్లాకు తెగులు సోకితే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో వ్యయప్రయాసలకోర్చి పండించిన పంటను రైతులు ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టు, చినమనగుండం, గరిమినపెంట, పాతపాడు, నాయుడుపేట, నాగంపల్లి, సలనూతల గ్రామాల్లో ఎక్కువగా అలసంద, మినుము పంటలు సాగు చేశారు. గత నెలలో 10 రోజులపాటు కురిసిన వర్షాలకు పంటలు నీట మునిగి ఉరకెత్తిపోయాయి. అలసంద ఉరకెత్తగా, మినుముకు పల్లాకు తెగులు సోకింది. రైతులు చేసేదేమీ లేక ఉరకెత్తిన పంటలతో పాటు పల్లాకు తెగులు సోకిన మినుము పైరును దున్నేస్తున్నారు. ఒక్క గొట్లగట్టు, పాతపాడు గ్రామాల్లో 150 ఎకరాల మేర మినుము దున్నేశారు. ఎకరాకు రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు, మళ్లీ పెట్టుబడి పెట్టి ఏ పంటలు సాగు చేయాలో అర్థంకాక అయోమయంలో పడిపోయారు.



పల్లాకు తెగులు సోకిన మినుము పంట

ప్రభుత్వ తీరుపై రైతుల అసంతృప్తి

కృష్ణా జిల్లా రకం మినుము సాగు చేసి నష్టాల్లో మునిగిపోయామని కొనకనమిట్ల మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత నష్టం జరిగినా ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ సాయం అందే అవకాశాలు కనిపించడం లేదని ఆందోళన చెందుతున్నారు. మళ్లీ పంటలు సాగు చేయడానికి అవసరమైన విత్తనాలు సబ్సిడీపై కూడా అందించకపోవటంతో రైతులు ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యకం చేస్తున్నారు.

రూ.లక్ష నష్టపోయా..



నేను బయట మార్కెట్‌లో కృష్ణా జిల్లా రకం మినుములు కొనుగోలు చేసి 10 ఎకరాల్లో సాగు చేశా. పంట మొదట్లో బాగానే ఉన్నప్పటికీ నెల రోజుల తర్వాత పల్లాకు తెగులు సోకింది. ఆకులు మొత్తం తెల్లగా, పచ్చగా మారాయి. పూత పిందె రావాల్సిన సమయంలో పంట మొత్తం పాలిపోయింది. ఇక లాభం లేదని ట్రాక్టర్‌తో దున్నేస్తున్నాం. ఇప్పటికే 10 ఎకరాలకు కలిపి రూ.లక్షకు పైగా ఖర్చు పెట్టాం. మళ్లీ వేరే పంటలు సాగు చేయాలంటే పెట్టుబడికి ఇబ్బందిగా ఉంటుంది. ప్రభుత్వం రైతులను ఉదారంగా ఆదుకోవాలని కోరుతున్నాం.

దొంతిరెడ్డి వెంకటరెడ్డి, రైతు, పాతపాడు

చిరు వ్యాపారులను ఆదుకోవాలి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న చిరువ్యాపారులు, పక్కన గాలి వెంకటరామిరెడ్డి

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఇటీవల ఆక్రమణల పేరుతో చిరువ్యాపారుల పొట్ట కొట్టారని, వారికి వెంటనే ప్రత్యామ్నాయం చూపాలని రైతు సంఘం నాయకులు గాలి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆక్రమణల తొలగింపులో భాగంగా తీవ్రంగా నష్టపోయిన వ్యాపారులతో కలిసి సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆక్రమణల పేరుతో ఇటీవల మున్సిపల్ అధికారులు పట్టణంలోని రోడ్ల వెంట బంకులు, టీ స్టాల్స్‌ను తొలగించడంతో 300 మందికి పైగా వ్యాపారులు వీధినపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన వారం రోజులుగా వారికి ఎటువంటి ఆదాయ వనరులు లేక కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.

నిమ్మలో చీడపీడలతో దిగుబడిపై ప్రభావం



నిమ్మతోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి సంధ్య

పొదిలి రూరల్: నిమ్మ తోటల్లో కలుపు, ఎండుపుల్ల తీయకపోవడం వల్ల చీడపీడలు ఆశించి దిగుబడి తగ్గుతుందని ఉద్యానశాఖ అధికారి డాక్టర్ డి.సంధ్య పేర్కొన్నారు. సోమవారం ఆమె పొదిలి మండలంలోని కంభాలపాడులో రైతులు సాగు చేసుకుంటున్న నిమ్మ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిమ్మ తోటల్లో అడ్డదిడ్డంగా ఉన్న నీటి కొమ్మలను ఏటా అక్టోబర్ మాసంలోనే కత్తిరించాలని సూచించారు. మొక్క మొదలు తడిచేలా బోర్డు మిశ్రమాన్ని పిచికారీ చేయాలని సూచించారు. పాదులు గట్టిపడకుండా తేలికపాటి సేద్యం చేయాలన్నారు. తోటలో ఆకు ముడత, మంగు కనిపిస్తే లీటరు నీటికి 5 మి.లీ వేపనూనె కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో విస్తరణాధికారి బి.ధనలక్ష్మి, వ్యవసాయ సహాయకురాలు సునీత, రైతులు పాల్గొన్నారు.

ఈతలో సత్తాచాటిన పొదిలి యువకుడు

- నాలుగు విభాగాల్లో పతకాలు కైవసం చేసుకున్న శ్రీనివాసరావు
- 3 బంగారం, 1 సిల్వర్ పతకాలు సొంతం



శ్రీనివాసరావుకు పతకం ఇచ్చి సత్కరిస్తున్న ఏపీ స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మీనారాయణరెడ్డి

పొదిలి రూరల్: ఈత పోటీల్లో పొదిలి మండలం ఉప్పలపాడు పంచాయతీ గోగినేనివారి పాలేనికి చెందిన గోపనబోయిన శ్రీనివాసరావు సత్తా చాటాడు. నాలుగు విభాగాల్లో మూడు బంగారు పతకాలు, ఒక సిల్వర్ పతకం కైవసం చేసుకున్నాడు. రాజమహేంద్రవరంలో ఆంధ్రప్రదేశ్ 7 మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం జరిగాయి. ఈ పోటీలను మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. పోటీల్లో గోపనబోయిన శ్రీనివాసరావు 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో బంగారు పతకం, ఇండివిజువల్ మిడిల్ ఐఎం (ఇందులో నాలుగు స్ట్రోక్‌లు కలిపి ఒకేసారి చేయాల్సి ఉంటుంది) విభాగంలో రెండో బంగారు పతకం, 50 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్ విభాగంలో మూడో బంగారు పతకం సాధించాడు. నాలుగో విభాగంలో బటర్‌ఫ్లై స్ట్రోక్ (సీతాకోక చిలుక) విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. ఏపీ స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మీ నారాయణ రెడ్డి చేతుల మీదగా మెడల్స్ ఇచ్చి సత్కరించారు. వచ్చే నెలలో కర్నూల్‌లో జరగబోయే నేషనల్ మీట్‌కి ఎంపికై నందుకు పొదిలి వాసులు హర్షం వ్యక్తం చేశారు. స్విమ్మింగ్ పోటీల్లో నాలుగు పతకాలు సాధించిన శ్రీనివాసరావుకు పొదిలికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి పొదిలికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి రూరల్: పొదిలి ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జె.సుందరరావు తెలిపారు. పొదిలి డిపో పరిధిలోని పొదిలి, కొనకనమిట్ల, దర్శి, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి మండలాలల ప్రజలు, ప్రయాణికులు 9959225700కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు తెలియజేయవచ్చని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి సోమవారం తెలిపారు. 14న ప్రారంభోత్సవం, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, వ్యాసరచన పోటీలు, 16న పాటల పోటీలు దేశ భక్తి, జానపద, భావగీతాలు, 17న క్విజ్, కవి సమ్మేళనం, 18న వక్తృత్వ పోటీలు, 19న మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ పోటీల నిర్వహణ, 20న జాతీయ గ్రంథాలయ వారోత్సవ ముగింపు వేడుకలు, విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. చాలా కాలం నుంచి సభ్యుల వద్ద ఉన్న గ్రంథాలయ పుస్తకాలను ఆలస్య రుసుం లేకుండా వారోత్సవాల సందర్భంగా తిరిగి తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9441586788ను సంప్రదించాలని కోరారు.

తర్లుపాడు: ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తర్లుపాడు లైబ్రేరియన్ పీవీ సుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జెండా ఆవిష్కరణతో పాటు విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ధ్రువీకరణతో శాఖా గ్రంథాలయంలో వివరాలు సమర్పించాలని సూచించారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీపై గ్రామ సభలు



కొండాయపాలెంలో గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని 16 పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై విచారణ చేపట్టి సోమవారం గ్రామ సభలు నిర్వహించారు. మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్, పీఆర్‌లో 637 పనులకు రూ.7,83,49,499 ఖర్చు చేశారు. ఆముదాలపల్లి, ఏలూరు, కుంచేపల్లి, కొండాయపాలెం, మల్లవరం, ఉప్పలపాడు, పాములపాడు, ఓబులక్కపల్లి గ్రామాల్లో పనులను తనిఖీ చేసినట్లు సామాజిక తనిఖీ బృందం పేర్కొంది. కొలతలు, కూలీల సంతకాలు, వేతన చెల్లింపుల్లో తప్పిదాలు చోటు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.శ్రీనివాసులురెడ్డి, ఏపీఓ వెంకట్రావు, డీఆర్పీలు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి



మౌలానా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షంషేర్ అలీబేగ్



కార్యక్రమంలో పాల్గొన్న అన్నా కృష్ణచైతన్య



ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్యాయులు



లింగారెడ్డి కాలనీలో మౌలానా అబుల్ కలాం చిత్రపటాలతో విద్యార్థులు

మార్కాపురం టౌన్: భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతిని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. ఆజాద్ సేవలకు గుర్తుగా ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ఆజాద్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ముందుగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉర్దూ ఉపాధ్యాయులు ఎస్‌డీ సమీఉల్లాబాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పొదిలి: స్థానిక గ్రంథాలయంలో సోమవారం మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని లైబ్రేరియన్ కె.శ్యాంసన్, రిటైర్డ్ ఉపాధ్యాయులు హుస్సేన్ పాచ్చా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

మార్కాపురం: స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ మహనీయుడని ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీ బేగ్ పేర్కొన్నారు. సోమవారం ఆజాద్ జయంతి సందర్భంగా పట్టణ శివారులోని ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో 16వ జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ మీర్జా మసూద్ అలీబేగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, సీఎస్‌ఈ హెడ్ మహమ్మద్ రఫీ, డిప్లొమా ఇన్‌చార్జి సందీప్ పాల్గొన్నారు.

కిట్స్ కళాశాలలో..

కిట్స్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నేషనల్ ఎడ్యుకేషన్ డే వేడుకలను కళాశాల సెక్రటరీ అన్నా కృష్ణచైతన్య ఆధ్వర్యంలో నిర్వహించారు. మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు దేశానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని కృష్ణ చైతన్య సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రంగనాయకులు, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ అనీల్‌కుమార్, కళాశాల ఏఓ ప్రభాకర్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలోని లింగారెడ్డికాలనీ ఎంపీపీ పాఠశాలలో డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి హెచ్‌ఎం మౌలాలి ఆధ్వర్యంలో విద్యార్థులు నివాళి అర్పించారు. ఉపాధ్యాయుడు అల్లా భక్షు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లిపాయల లోడ్ లారీ బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు



మార్కాపురం రూరల్: పెద్దారవీడు నుంచి ఖమ్మం వెళ్తున్న ఉల్లిపాయల లోడు లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటన సోమవారం రాత్రి మార్కాపురం మండలం తిప్పాయపాలెం–జంగంగుంట్ల గ్రామాల మధ్య మిట్టమీదిపల్లి క్రాస్ రోడ్ వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నాగేంద్రబాబు, మరో వ్యక్తి అంకిరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి.



మార్కాపురం : కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



పొదిలి : నిర్మమహేశ్వర ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



పెదారికట్ల శివాలయంలో మహిళల పూజలు

హర హరా.. సర్వేశ్వరా..



గిద్దలూరు : ప్రత్యేక అలంకరణలో గిరిజానాథస్వామి

కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలు వేకువజామున దీప కాంతుల్లో తళుకులీనాయి. ఆధ్యాత్మికత ఉట్టిపడుతున్న వేళ భక్తుల హరనామ స్మరణతో ఆలయాల పరిసరాలు మారుమోగాయి. పెద్ద సంఖ్యలో మహిళలు శివాలయాల్లో రుద్రాభిషేకం, కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఆలయాల్లో శివలింగాలను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు దాతలు, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కొమరోలు : త్రిపురాంతకేశ్వర ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



మార్కాపురం : ప్రత్యేక అలంకారంలో మార్కండేశ్వర స్వామి